## క్లుప్తంగా

### ఇద్దరు జూదరుల అరెస్ట్

పొన్నలూరు: మండలంలోని మాలపాడు గ్రామంలో పేకాటాడుతున్న ఇద్దరిని స్థానిక పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. పొలాల్లో పేకాటాడుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్సై అనుక్ తన సిబ్బందితో దాడి చేశారు. అరెస్ట్ చేసిన వారి నుంచి రూ.2,100 నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్సై తెలిపారు.

### మర్రిపూడిలో పారిశుధ్య పనులు

మర్రిపూడి: మర్రిపూడి పంచాయతీ పరిధిలోని దుగ్గిరెడ్డిపాలెం, మర్రిపూడి, గంగపాలెం గ్రామాల్లో శుక్రవారం పారిశుధ్య పనులు నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి నక్కా శ్రీనివాసులు ఆధ్వర్యంలో కాలువల్లో పూడికతీత పనులు చేపట్టారు. కాలువల వెంట బ్లీచింగ్ చల్లించారు. దోమల నివారణకు ఎబేట్, ఫాగింగ్ పనులు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శిని గ్రామస్తులు కోరారు.

### గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి



కోటపాడులో మాట్లాడుతున్న ఎంపీడీఓ సుజాత

పొన్నలూరు:గ్రామాల అభివృద్ధికి స్థానిక ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది కృషి చేయాలని ఎంపీడీఓ సుజాత కోరారు. మండలంలోని కోటపాడు సచివాలయంలో శుక్రవారం సచివాలయ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో ప్రత్యేకంగా పారిశుధ్య కార్యక్రమం చేపట్టి స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దాలన్నారు. అలాగే పరిశుభ్రమైన తాగునీరు అందించాలన్నారు. పింఛన్లు కూడా పారదర్శకంగా పంపిణీ చేయాలన్నారు. అంతర్గత రహదారులను సీసీ రోడ్లుగా నిర్మించడానికి నిధులు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### అపరాలు, చిరుధాన్యాల సాగు పెంచండి



మాట్లాడుతున్న ఏఓ యుగంధర్‌రెడ్డి

జరుగుమల్లి (సింగరాయకొండ): పొగాకుకు ప్రత్యామ్నాయంగా అపరాలు, చిరుధాన్యాల సాగు గణనీయంగా పెంచాల్సిన ఆవశ్యకత ఉందని ఏఓ యుగంధర్‌రెడ్డి అన్నారు. జరుగుమల్లి మండలం రెడ్డిపాలెం రైతు భరోసా కేంద్రం వద్ద శుక్రవారం పొగాకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించారు. ప్రజల అవసరాలకు సరిపడా పంటలు పండిస్తే ఆహార కొరత ఉండదని, రైతుకు అధిక లాభాలు సమకూరుతాయని అన్నారు. జిల్లా వనరుల కేంద్రం ఏఓ వెంకటశేషమ్మ, రైతులు పాల్గొన్నారు.

### గేదెల షెడ్‌లు ఏర్పాటు చేయాలి



గేదెల షెడ్లను పరిశీలిస్తున్న ఎంపీడీవో ప్రభాకర్ శర్మ

పీసీపల్లి: పశుపోషకులకు ఉపయోగపడేలా గేదెల షెడ్లు ఏర్పాటు చేయాలని ఎంపీడీవో ప్రభాకర్ శర్మ అన్నారు. మండల పరిధిలోనే నేరేడుపల్లి, పోతవరంలో ఏర్పాటు చేస్తున్న గేదెల షెడ్లను ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పశుపోషకుడికి ఉపయోగపడే విధంగా షెడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఫీల్డ్ అసిస్టెంట్ దగ్గరుండి నిర్మాణాన్ని పరిశీలిస్తూ ఉండాలని చెప్పారు. ఈయన వెంట ఏపీవో సుబ్బారావు, ఈసీ సత్యనారాయణ, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

### ఉత్తీర్ణత శాతం పెరిగేందుకు కృషి చేయండి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈఓ కిరణ్‌కుమార్

జరుగుమల్లి (సింగరాయకొండ): విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెరిగేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని, అందు కోసం ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని డీఈఓ ఏ కిరణ్‌కుమార్ ఉపాధ్యాయులకు సూచించారు. జరుగుమల్లి మండలంలోని కె.బిట్రగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కేజీబీవీని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి వారి నైపుణ్యాలను స్వయంగా పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై 10వ తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెరగడానికి, అత్యధిక మార్కులు రావడానికి తీసుకుంటున్న చర్యల గురించి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులకు పలు సలహాలు, సూచనలు చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంఈఓ నాగేంద్ర వదన్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# రేషన్‌కు రెక్కలు

- ఎమ్‌ఎల్‌ఎస్ పాయింట్‌లో బస్తాల్లో తూకాల్లోనే తేడాలు
- రేషన్ షాపుల్లోనే మాయమవుతున్న బియ్యం బస్తాలు
- 174 షాపుల్లో బియ్యం పంపిణీ వ్యవస్థ అస్తవ్యస్తం
- సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ కందుకూరు ఎమ్‌ఎల్‌ఎస్ పాయింట్ ఆకస్మిక తనిఖీలు
- అధికారులకు చెమటలు పట్టించేలా ప్రశ్నలు
- అధికారులకు మద్దతుగా పరుగులు తీసిన నాయకులు, మిల్లర్లు



కందుకూరులోని ఎమ్‌ఎల్‌ఎస్ పాయింట్



కందుకూరు ఎమ్‌ఎల్‌ఎస్ పాయింట్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి

కందుకూరు రూరల్:

కందుకూరు నియోజకవర్గంలో రేషన్ షాపుల డీలర్ల అక్రమాలకు అడ్డులేకుండా పోతోంది. కందుకూరు మార్కెటింగ్ యార్డులో ఉన్న ఎమ్‌ఎల్‌ఎస్ పాయింట్‌లో రేషన్ బియ్యం బస్తాలకు అవినీతి బొక్కలు పడుతుంటే... రేషన్ షాపుల్లో బస్తాలకు బస్తాలే మాయమవుతున్నాయి. ఎమ్‌ఎల్‌ఎస్ పాయింట్ నుంచి ప్రతి నెలాఖరులో అన్ని రేషన్ షాపులకు బియ్యం సరఫరా చేసే సమయంలోనే దారిమళ్లుతున్నాయి.

నియోజకవర్గంలో 174 రేషన్ షాపులు ఉన్నాయి. ఈ షాపులకు కందుకూరులోని మార్కెట్ యార్డులో ఉన్న మండల లెవల్ స్టాక్ (ఎమ్‌ఎల్‌ఎస్) పాయింట్ నుంచి బియ్యాన్ని సరఫరా చేస్తారు. అయితే బియ్యం సరఫరాలోనే అవకతవలకు జరుగుతున్నాయి. ఒక్క బస్తా కూడా నికరమైన తూకంలో లేదు. ఒక్కొక్క బస్తా ఒక్కొక్క విధంగా ఉంది. ఒకటి తక్కువ ఒకటి ఎక్కువ ఉంటుంది. ఇలా స్టాక్ పాయింట్‌లోనే బస్తాలకు బొక్కలేసి బియ్యాన్ని లాగేస్తున్నారు. దీని వల్ల బస్తాల్లో తూకాలు తగ్గుతున్నాయి. అదే విధంగా షాపుల్లో కూడా రేషన్ కార్డు దారుల పంపిణీకి ముందే బస్తాలు మాయం చేస్తున్నారు. షాపుల్లో స్టాక్‌ను పరిశీలిస్తే భారీ మొత్తంలో తేడాలు బయట పడుతున్నాయి. ప్రజలకు పంపిణీ చేయకముందే బియ్యం పక్కదారి పడుతున్నాయంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థమవుతుంది.

**రేషన్ వాహనాలకు చేరని బియ్యం...**

రేషన్ షాపుల నుంచి రేషన్ వాహనాలకు బియ్యం అందించి అక్కడ నుంచి బయోమెట్రిక్ ద్వారా లబ్ధిదారులు బియ్యం అందిస్తారు. అయితే రేషన్ వాహనాల్లో నామకార్థంగా నాలుగు బస్తాలు చూపిస్తారు. లబ్ధిదారులు వచ్చి వేలి ముద్ర వేస్తే డబ్బులు ఇచ్చి పంపిస్తారు. దీంతో వాహనంలో బియ్యం ఉండాల్సిన అసరం కూడా రావడం లేదు. అప్పటికే డీలర్లు బియ్యం పక్కదారి పట్టించి ఉంటున్నారు. డీలర్ షాపుల్లో, వాహనాల్లో బియ్యం స్టాక్ ఉండాల్సిన అవసరం కూడా లేకుండా పోతుంది. ఈ విధంగా షాపుల్లో భారీగా స్టాక్ తేడాలు కనిపిస్తున్నాయి.

**తనిఖీల్లో బట్టబయలు...**

సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి కందుకూరు ఎమ్‌ఎల్‌ఎస్ పాయింట్‌ను గత నెల 29వ తేదీ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అక్కడ చూసిన అక్రమాలకు ఆయన నివ్వెరపోయారు. నియోజకవర్గంలో 174 రేషన్ షాపులు ఉండగా 160 షాపులకు రేషన్ బియ్యం పంపిణీ చేసినట్లు రికార్డులు ఉన్నాయి. వీటిల్లో 61 షాపుల డీలర్లు బయోమెట్రిక్ వేయకుండానే బియ్యం షాపులకు పంపించినట్లు గుర్తించారు. బియ్యం బస్తాల తూకాల్లో తేడాలు ఉన్నాయి. ఈ విధంగా ప్రజా పంపిణీ వ్యవస్థ ఉంటే ఎలా అని అధికారులను ప్రశ్నించారు. అక్కడ జరుగుతున్న అవినీతికి అధికారులు బలైపోతారోమోనని స్థానిక అధికార పార్టీ నాయకులు వచ్చి ఆయనకు సర్దిచెప్పే ప్రయత్నం చేసినా తనిఖీలు ఆపలేదు. ఆయన ప్రశ్నలతో అధికారులకు చెమటలు పుట్టాయి. సరఫరా చేసిన షాపుల లిస్టు తీసుకొని వలేటివారిపాలెంలోని రేషన్ షాపునకు వెళ్లారు. వెళ్లి స్టాక్ తనిఖీలు చేయగా 76 బస్తాలు తేడాలు కనిపించింది. గత నెల 28వ తేదీనే బస్తాల స్టాక్‌లో తేడాలు వచ్చాయి. అది కూడా నవంబర్‌లో పంపిణీ చేయాల్సిన స్టాక్. పంపిణీ మొదలు కానేలేదు...అప్పుడే స్టాక్‌లో తేడాలు రావడంతో డైరెక్టర్‌తోపాటు అధికారులు నివ్వెరపోయారు. ఒక షాపుల్లోనే ఇంత తేడా ఉంటే నియోజకవర్గంలోని 174 షాపులు చూస్తే ఎన్ని చిత్రాలు బయటపడతాయోనని ఆయన వ్యాఖ్యానించడం చర్చనీయాంశమైంది.

**పరుగులు తీసిన మిల్లర్లు...**

ఎమ్‌ఎల్‌ఎస్ పాయింట్‌లో తనిఖీలు జరుగుతున్నాయని తెలియగానే నియోజకవర్గంలోని మిల్లర్లు ఎమ్‌ఎల్‌ఎస్ పాయింట్‌కు పరుగులు తీశారు. ఎలాగైనా పట్టాభిరామిరెడ్డికి సర్ది చెప్పాలని ప్రయత్నించారు. కానీ అక్కడ వారి పప్పులు ఏమీ ఉడకలేదు. స్టాక్ పాయింట్‌లోనే వేలిముద్రలు వేయకుండా స్టాక్ పంపించిన అధికారులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. ఇది ఇలా ఉంటే ప్రస్తుతం రేషన్ బియ్యం ధర బాగానే పలుకుతోంది. లబ్ధిదారుల వద్ద కేజీ రూ.16 నుంచి రూ.20 వరకు కొనుగోలు చేస్తున్నారు. వీటిని పాలిష్ పట్టి కేజీ రూ.32లకు విక్రయిస్తున్నారు. దీంతో సగానికి సగం లాభం వస్తుంది. సుమారు 700 టన్నుల వరకు ప్రతి నెలా కందుకూరు నియోజకవర్గం నుంచి కృష్ణపట్నం పోర్టుకు వెళ్తున్నట్లు సమాచారం.

## కార్తీక శోభను సంతరించుకున్న శైవ క్షేత్రాలు



భైరవకోన త్రిముఖదుర్గాదేవి అమ్మవారు



పామూరులోని అష్టాదశ శక్తిపీఠాలు, ద్వాదశ జ్యోతిర్లింగాల ఆలయం

పామూరు: కార్తీక శుద్ధ పాడ్యమితో పవిత్ర కార్తీక మాసం శుక్రవారం సాయంత్రం నుంచి ప్రారంభం కాగా మండలంలోని శైవక్షేత్రాలు ప్రత్యేక శోభను సంతరించుకున్నాయి. ఈ సందర్భంగా స్థానిక వల్లీ సమేత భుజంగేశ్వరస్వామి ఆలయం, అష్టాదశ శక్తిపీఠం, ద్వాదశజ్యోతిర్లింగాల ఆలయం, బొట్ల గూడూరులోని కామాక్షీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయం, దాదిరెడ్డిపల్లెలోని పార్వతీ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయం, పడమటి కట్టకిందపల్లెలోని శ్యామలా కామాక్షి సమేత మల్లేశ్వరస్వామి ఆలయం, మోపాడు పంచాయతీ పరిధిలోని గొందిమల్లేశ్వరస్వామి ఆలయాలతో పాటు మండలంలోని అనుమునిగిరి శ్రీ శివరామ బ్రహ్మక్షేత్రం ప్రత్యేక శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా ఆలయాల్లో కార్తీక మాసంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించేందుకు అదేవిధంగా భక్తులు కార్తీక దీపాలు వెలిగించుకునేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

**కార్తీకం..శుభప్రదం**

సీఎస్‌పురం (పామూరు): హరిహరులకు ఎంతో ప్రీతికరమైన కార్తీక మాసం బుధవారం కార్తీక శుద్ధ పాడ్యమితో ప్రారంభభమైంది. కృత్తికా నక్షత్రంలో పున్నమి చంద్రుడు సంచరించే మాసం కావడంతో ఈ మాసానికి ×కార్తీకం¥ అని పేరువచ్చింది. కృత్తిక అగ్ని సంబంధ నక్షత్రం కావడంతో కార్తీక మాసంలో దీపారాధనకు విశేష ప్రాధాన్యం ఉంది. అన్ని ఆలయాలు, నదీతీరాలు, ఇళ్లలో సహితం దీపాలను వెలిగించడం పుణ్యప్రదమని కార్తీక పురాణం చెబుతోంది. దీపదర్శనం, దీపదానం, దీపప్రకాశనం అనే మూడు ఈ మాసంలో ఎంతో పుణ్యాన్నిస్తాయని, అష్టైశ్వరాలను ప్రసాదిస్తాయని భక్తులు విశ్వసిస్తారు.

## ప్రత్యామ్నాయ పంటలవైపు మొగ్గు చూపాలి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త వెంకటేశ్వరరెడ్డి

కొండపి: పొగాకు రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపాలని శాస్త్రవేత్త టి.వెంకటేశ్వరరెడ్డి సూచించారు. శుక్రవారం కొండపిలోని పొగాకు వేలం కేంద్రంలో పొగాకు రైతులకు పంట ఉత్పత్తి నియంత్రణ, పొగాకు పంటకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు పంటకు ప్రత్యామ్నాయంగా నల్లరేగడి నేలలో శనగ, మినుము, కంది, బొబ్బర్లు తదితర పంటలు సాగు చేయాలని సూచించారు. ఎండు తెగులు, పల్లాకు తెగులు, తుప్పు తెగులు మొదలగు వాటిని తట్టుకునే రకాలను సాగుచేసుకోవాలన్నారు. ప్రాంతీయ వేలం నిర్వహణ అధికారి జై తులసి మాట్లాడుతూ ప్రపంచంలో వివిధ దేశాల్లో పండిస్తున్న పొగాకు ఉత్పత్తిని, పరిమాణాన్ని రైతులకు తెలియజేశారు. అధిక ధరలకు బ్యారన్లు, పొలాలు, కౌలుకు తీసుకోవద్దని సూచించారు. రైతులు బోర్డు సూచించిన పరిమితి మేరకే పొగాకు పండించాలన్నారు. వ్యవసాయ అధికారి విజయకుమార్ మాట్లాడుతూ పొగాకు పంట వేసిన ప్రతి రైతు పంట నమోదు చేసుకుని ఈ క్రాపింగ్, ఇన్సూరెన్స్ చేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో పొగాకు బోర్డు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో మహబూబ్ సుభాని గంధ మహోత్సవం



దర్గా వద్ద చైర్మన్ అబ్దుల్ గఫార్, స్థానిక నాయకులు

కనిగిరి రూరల్: హజరత్ మహబూబ్ సుభానీ గంధ మహోత్సవం కనిగిరిలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పలు వార్డుల్లో మహబూబ్ సుభాని దర్గాల వద్ద ఉరుసు మహోత్సవం (గ్యార్‌వీ)ని గురు, శుక్రవారాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా పలు చోట్ల అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. స్థానిక 9వ వార్డులోని మహబూబ్ సుభాని దర్గాను ఉరుసు సందర్భంగా విద్యుత్, దీపపూల అలంకరణలతో బహుసుందరంగా తీర్చిదిద్దారు. హజరత్ వారి జెండాలను ఎంతో నియమ నిష్టలతో మేళ తాళాలతో ఊరేగించారు. కుల, మత వర్గాలకతీతంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. అనంతరం దర్గా కమిటీ, స్థానికుల ఆధ్వర్యంలో భారీ అన్నదానం చేశారు.

**ప్రత్యేక పూజల్లో చైర్మన్ అబ్దుల్ గఫార్**

మహబూబ్ సుభాని గంధ మహోత్సవంలో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అల్లాహ్ కృపతో సర్వ మానావళి సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. ఎస్‌కే రహిమాన్, నాగూర్‌వలి, డాక్టర్ నాయబ్ రసూల్, బాషా, సమద్, నాగూర్ బీ, భారతి పాల్గొన్నారు.

## ఘనంగా దీపావళి వేడుకలు



కనిగిరి పట్టణంలో దీపావళి సందడి

కనిగిరి రూరల్: దీపావళి పర్వదినం వేడుకలను గురువారం రాత్రి కనిగిరిలో ఘనంగా చేసుకున్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక నిర్వహించునే దీపావళి పండగను అందరూ సంతోషంగా జరుపుకున్నారు. ప్రమిదల్లో దీపాలు వెలిగించి.. కొత్త కాంతులకు స్వాగతం పలికారు. ప్రతి ఇంటి ముందు దీపావళి టపాసుల మోత మోగింది. చిన్నారుల నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరూ కాకర ఒత్తులు, చిచ్చు బుడ్లు, భూచక్రాలు, ఇలా రక రకాల దీపావళి సామగ్రిని కాల్చారు. కుర్రకారు, యువత లక్ష్మీబాంబులు, వంకాయ బాబులు, షార్ట్ బాంబులతో పట్టణం మోత మోగింది. గురువారం మధ్యాహ్నం వరకు మందకొడిగా సాగిన దీపావళి సామగ్రి విక్రయ వ్యాపారం రాత్రికి ఊపందుకుంది. కొందరు మారిన కాలానుగుణంగా పాస్టిక్ దీపాల విద్యుత్ కాంతులు వెలిగించి, ఇళ్ల ముంగిట ఆకర్షణీయంగా అలంకరించారు. దీపావళి పండగను పురస్కరించుకుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.

**కొండపి/పొన్నలూరు/మర్రిపూడి/టంగుటూరు:** దీపావళి వేడుకలను కొండపి నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో గురువారం ఘనంగా జరుపుకున్నారు. కొండపి, పొన్నలూరు, మర్రిపూడి, టంగుటూరు మండలాల్లో ఆనందోత్సాహాల మధ్య ప్రజలు బాణసంచా కాల్చి సందడి చేశారు. ఉదయం నుంచి లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం విద్యుత్ దీపాల కాంతులు, టపాసుల శబ్దాలతో పట్టణాలు, గ్రామాల్లో మార్మోగాయి. వ్యాపార, వాణిజ్య సంస్థలను విద్యుత్ దీపాలు, పూలతో అందంగా ముస్తాబు చేశారు. బాణసంచా దుకాణాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఫైర్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, పోలీస్ సిబ్బంది తగిన చర్యలు తీసుకున్నారు.

## వైఎస్ జగన్‌ను విమర్శించే స్థాయి పవన్‌కు లేదు

- పీడీసీసీబీ మాజీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి

కనిగిరి రూరల్: మాజీ సీఎం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని విమర్శించే స్థాయి జనసేన నేత పవన్ కళ్యాణ్‌కు లేదని పీడీసీసీబీ మాజీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి (బన్నీ) అన్నారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎమ్మెల్యేగా పవన్ రెండు చోట్ల పోటీ చేసి ఓడిపోయిన చరిత్రను గుర్తు చేశారు. కూటమి గుంపులో గెలిచి అధికారాన్ని అనుభవిస్తున్న పవన్‌కళ్యాణ్ వైఎస్సార్ సీపీని విమర్శించడం తగదని మండిపడ్డారు. పవన్ కళ్యాణ్‌కు దమ్ముంటే ఎన్నికల బరిలో సింగిల్‌గా పోటీ చేసి గెలిచి అప్పుడు మాట్లాడాలన్నారు.

## ఎన్నికల సిబ్బందికి రెమ్యునరేషన్ చెల్లించాలి

కనిగిరి రూరల్: ఎన్నికల విధుల్లో పాల్గొన్న వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులకు తక్షణం రెమ్యునరేషన్ చెల్లించాలని ఏపీ ఎన్జీవో సంఘ నాయకులు పిల్లి వెంకటరమణారెడ్డి, హజరత్ అలీ, నరసింహారావు, కిరణ్ కోరారు. ఈ మేరకు ఆర్డీఓ శివ శేషవర్ధన్‌రెడ్డికి శుక్రవారం వినతి పత్రం అందచేశారు. 2024 సాధారణ ఎన్నికల్లో అనేక మంది అంకిత భావంతో ఫ్రంట్ లైన్ వర్కర్స్‌గా, బూత్ లెవల్ అధికారులుగా, సూపర్ వైజర్లుగా, ఈవీఎం కమిషనింగ్ సెక్టార్ అధికారులకు సహాయకులుగా పని చేశారని చెప్పారు. ఎన్నికలకు పోలింగ్ కేంద్రాల వారీగా ఎన్నికల సామగ్రిని సిద్ధం చేసిన సిబ్బందికి కూడా రెమ్యునరేషన్ ఇవ్వలేదన్నారు. తక్షణం ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకుని న్యాయం చేయాలని వారు ఆ వినతిలో పేర్కొన్నారు.

## మాలల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా..

టంగుటూరు: ఎస్సీ వర్గీకరణ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మాలలకు న్యాయం చేస్తానని సాంఘిక సంక్షేమ శాఖామంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయస్వామి అన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా మాల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నాయకులు గురువారం తూర్పునాయుడుపాలెంలోని మంత్రి నివాసంలో డోలాను కలిశారు. ఎస్సీ వర్గీకరణ, క్రిమీలేయర్ వల్ల మాలలకు జరిగే నష్టాన్ని మంత్రికి నాయకులు వివరించారు. రాష్ట్రంలో ఎస్సీ జనగణన చేసి రిజర్వేషన్ శాతాన్ని పెంచేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు వినతిపత్రం అందజేశారు. మాల ఉద్యోగుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు గడ్డం హనుమంతరావు, బల్లికూర గోపీనాథ్, కోశాధికారి యరమాల మల్లికార్జున్, కార్యనిర్వాహక అధ్యక్షుడు దమ్ము థామస్, ఉపాధ్యక్షుడు చిడితోటి శ్రీరాములు, నాయకులు వివేక్, క్రాంతి, శాంతారావు, తిరుపతిస్వామి, జాలయ్య, శ్రీకాంత్, కసుకుర్తి మల్లికార్జునరావు, ఏడుకొండలు, మాల సంఘాల జేఏసీ జిల్లా కన్వీనర్ పిల్లి మాల్యాద్రి, పట్టణ నాయకులు రవి, రాజు, బుజ్జి, రమేష్ పాల్గొన్నారు.

## ఆర్టీసీ డిపో అభివృద్ధికి సహకారం అందిస్తా

కనిగిరి రూరల్: కనిగిరి ఆర్టీసీ డిపోను మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ శుక్రవారం సందర్శించారు. డిపోలోని డ్రైవర్లు, కండక్టర్లు, కార్మికులతో, సిబ్బందితో కలిసి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎం మొహ్మద్ సయనా బేగంతో మాట్లాడి వివిధ సమస్యలపై చర్చించారు. అనంతరం చైర్మన్ గఫార్ మాట్లాడుతూ ప్రయాణికుల సౌకర్యార్థం, డిపో అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు.

## మానవత సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం

పామూరు: సీఎస్‌పురం మండలం కోవిలంపాడు గ్రామానికి చెందిన గొంట్ల తిరుపతయ్య గతేడాదిగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. నారాయణ కుటుంబ సభ్యులు వైద్య ఖర్చుల కోసం పామూరు మానవత సంస్థను ఆర్థిక సాయం కోరారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక దివ్య జ్ఞాన సమాజంలో జరిగిన కార్యక్రమంలో బాధితుని కుమారుడు నారాయణకు మానవత సంస్థ చైర్మన్ కె.రామిరెడ్డి, అధ్యక్షుడు మెడబలిమి ముసలయ్య, కన్వీనర్ వెండిదండి వెంకటేశ్వరరెడ్డి పలువురు సభ్యులు ఆర్థిక సాయం చెక్కును అందజేశారు. తోట రమేష్, పి.తిరుపతిరెడ్డి, రంగారెడ్డి, శేగు కృష్ణయ్య, కాకు నాగేశ్వరరావు, ముక్కు తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు ఆర్థిక సాయం

పామూరు: యోగా రాష్ట్రస్థాయి పోటీలకు పామూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 9 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. వీరు నెల్లూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా పోటీల్లో పాల్గొనేందుకు వెళ్లే విద్యార్థులకు ఖర్చుల కోసం శుక్రవారం పామూరు జీహెచ్‌ఎస్‌లో జరిగిన కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రామస్వామి, పీడీ మస్తానీల సమక్షంలో దాతలు పాఠశాల పీఎంసీ చైర్మన్ గుత్తి కొండలరావు, అర్చకులు మహంకాళి శివప్రసాద్, మితికాల నారాయణ, జీజేసీ అధ్యాపకుడు గుత్తి రమణయ్యలు రూ.10 వేలు విద్యార్థులకు అందజేశారు.

## 85 మందికి 104 వైద్య సేవలు

హనుమంతునిపాడు: మండలంలోని కొండారెడ్డిపల్లి సచివాలయం పరిధిలో జరిగిన 104 వైద్య క్యాంప్‌లో 85 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారి ఇళ్లకు వెళ్లి వైద్య పరీక్షలు చేశారు. మందులు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన వైద్య కాంప్‌లో బీపీ, సుగర్, జలుబు, దగ్గు, జ్వరం, రక్త పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు మెడికల్ అధికారి దార్ల సందీప్‌కుమార్ తెలిపారు. ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎం, ఆశాలు,"ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

## నూరు శాతం పింఛన్లు పంపిణీ చేయాలి

హనుమంతునిపాడు: మొదటి రోజే నూరు శాతం పింఛన్లు లబ్ధిదరులకు అందించాలని ఎంపీడీఓ ఎం.రంగసుబ్బరాయుడు అధికారులకు సూచించారు ఆయన శుక్రవారం జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని మొరవారిపల్లి, హనుమంతునిపాడులో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పింఛన్లు లబ్ధిదారులకు అందించారు. ఆయన మాట్లాడుతూ ఉదయం ఒక గంటపైన సర్వర్ సక్రమంగా పని చేయక కొన్ని గ్రామాల్లో పింఛన్ల పంపిణీకి కొంత జాప్యం జరిగిందన్నారు.